విచారం ఫిరాయింపు

శ్రీ అయ్యగారి విశ్వేశ్వరరావు

ఆఫీసుకు పోదామని గడప దాటాను కూడా విడిగా - అప్పుడే పదకొండు గంటలయింది. వెడుతున్నారూ – ఆఫీసుకి అంటూ ముసిముసి నవ్వులతో ఎదురయ్యాడు ప్రక్కయింటి పద్మనాభాచార్యులు.

అసలే ఆఫీసులో మనసీటు వార్నింగులమయంగా వుంది. టుడే-టుడే అని పడివున్న కాగితాలు తెగ బెదిరిస్తూ కలలోకూడా కనిపిస్తున్నాయి. ఆ టుడేలు యింకా రావేం అని పెర్సనలు అసిస్టెంటు వేసే కేకలుకూడా చెవుల్లో గింగురుమంటూంటే నిద్దట్లో కూడా వులిక్కి పడుతున్నాను. ఫైలు కనిపిస్తే కాగితం దొరకదు. కాగితం కనిపిస్తే ఫైలు దొరకదు. రెండూ - భగీరథ తపస్సు చేశాక కరుణించి కనిపిస్తే - అయ్యగారు రమ్మంటున్నారు సార్ అని డఫేదారు పిలుపు. కొంప మునుగు పోయినట్టు గడియారం తెగతిరుగుతుంది. ఏ కాగితాలూ కదలకుండానే అయిదు–ఆరు-ఏడు-నిరుత్సాహంగా యింటికి రావడం, పరధ్యానంతో భోజనం, తామరాకుమీద నీటిబొట్టులాగ యింట్లో మనశ్శాంతి లేకుండా వుండడం, తెల్లారడం - తెల్లమొహంతో - గుమాస్తానే బిక్కమొహంతో గంపెడు బెంగలతో మళ్లీ ఆఫీసుకు పోవడం-దిగాలుగా తిరిగి రావడం. నా సీటుని అద్దంలా చేసిపెట్టాలని ఎంతో తాపత్రయం వుంది. నిజం చెప్పాలంటే మంచి శకునం చూసుకుని ఆఫీసుకి వెళ్లానా - శకునబలమో - లేక అనుమానం లేని మానసికబలమో మరి - చకచకా చలాకీగా పని సాగిపోయేది. ఆవేళ హుషారుగా యింటికివచ్చి పిల్లలతో పార్కుకి షికారుకుకూడా పోయే అలవాటయింది. ఒక్కొక్కనాడు ఓ మహాతల్లి లేక మహానుభావుడు యిలా ఎదురయితే నా పాట్లు యీశ్వరుడి కెరుక. కలం కదలదు. రిమైండర్లు రెడీ. స్లిప్సు – ఆ ఫైలు కావాలి – యీ ఫైలు కావాలి అంటూ - ఏం చెప్పను – ఆవేళ మతిలేని పనులు – మనమే చేశామా అనే పనులు తట్టెడుంటాయి – ఇహ - యింటికి ఎలా వస్తానో స్పృహే వుండదు.

ఒంటి బ్రాహ్మణుడు - వైష్ణవమూర్తి ఫిరంగి గుండు దెబ్బలాగ మనకే నూటి శకునం. గుండె దడ దడ లాడింది. అప్రయత్నంగా యింట్లోకి వెళ్లాను.

పాపం మా అత్తగారు నా అవస్థ చూసింది. ఇంట్లోకి వెళ్లి మా శ్రీమతితో చెప్పింది. ఇంక మా ఆవిడ ఓ బాపతు నవ్వుముఖం పెట్టి - ఏం వచ్చారు - శకునం కుదరలేదా. అయినా రోజూ శకునం ఎందుకండీ–మీ పిచ్చ కాకపోతే - ఇంతకీ ఎవరెదురయ్యారేవిటి అంటూ యిన్ని ప్రశ్నలు వేసింది. అల్లుడుగారికి శకునాలంటే అంత నమ్మకమా? అనుకుంది అప్పుడే మా అత్తగారు. వూరికే చెప్పారుటే పెద్దలు - పెద్దలమాటలు వేదాక్షరాలు. దైవబలం అంతా శకునరూపేణా ముందే తెలుస్తుంది అంది. పాపం ఆ పెద్ద ముత్తైదువ. ఆ తర్వాత ఎవరు నాయనా ఎదురయింది? అని నన్ను చూసి అడిగింది.

'ఆఁ ఎవరూ కాదండీ మన ప్రక్కయింటి పద్మనాభాచార్యులుగారు. ఆయనే – ఎదురయ్యాడు, ఒంటిబ్రాహ్మణుడు ఎదురవకూడదూకదండీ పంచాంగంలో వ్రాస్తారు' అని అన్నాను నేను.

ఔను నాయనా - ఒంటిబ్రాహ్మణుడు ఎదురయితే ఆవేళ పనికాదు. మీ మామగారూ యింతే. ప్రతి పనికీ పంచాంగం చూస్తారు. తిండిలో ఏవిటి - తిరగడంలో యేవిటి - ఆఖరికి యీ పంచాంగం పట్టింపులో యేవిటి అచ్చు మామగారి పోలికే నువ్వు అంటూ మా అత్తగారు నన్ను మెచ్చుకుంది.

అంత పెద్ద ఆమె అలా అంటూంటే - మా ఆవిడ చ్రున అందుకుంది. ఈ బస్తీలలో యీ తిథులు– వారాలు-నక్షత్రాలు–రాహుకాలం – నా మొహం కాలం చూసుకుంటుంటే ఎలాగ. కాలం కళ్లెంలేని గుర్రంలా పోతుంది. అప్పుడే ఆయన ఆఫీసుకు అరగంట లేటయింది. ఏం – పద్మనాభాచార్యులుకేం. సాక్షాత్తూ విష్ణుమూర్తిలాంటి మనిషి. ఆ పంగనామాలు, ఆ వేషం - అంతా విష్ణుమూర్తే. విష్ణుమూర్తి ఎదురయితే మంచిదికాదూ అంది మా శ్రీమతి.

ఇలా వితండవాదం చేస్తూంటే - మరి వాదించడం మంచిదికాదని చరచరా ఆఫీసుకు వచ్చాను. ఆఫీసు గడియారం అరగంట స్లోలో పోతూంది, ఆవేళ నా కోసమేమో మరి. గప్‌చిప్‌గా లేటు అటెండెన్సు పీడ తప్పించుకొని — ఒగర్చుకుంటూ సీటులో పడ్డాను. ఇది కావాలి — అది కావాలి అని అప్పుడే అర్జంటు పిలుపులు ఆరంభమయ్యాయి. ఎన్నాళ్లనుంచో అజా పజాలేని ఫైలు ఆవేళ పుటప్ చేయాలన్నారు - ఆఫీసరుగారు ఆవేళ నన్ను పిలిచి మరీ చెప్పారు. ఆ ఫైల్సు సముద్రంలోపడి యీదుతున్నాను - పద్మనాభాచార్యులుని తలుచుకున్నాను. మహానుభావా! మీద వాలిన శకునమహిమ చెడ్డదనుకున్నాను. మీ దయవల్ల లేటు అటెండెన్సు గండం గడిచింది. ఇంక యీ ఫైలు కనిపిస్తే — తప్పకుండా పద్మనాభాచార్యులుగారి శకునం ఒంటిబ్రాహ్మడి శకునమైనా - మా ఆవిడ చెప్పినట్టు అది విష్ణుమూర్తి శకునంకింద జమకట్టుకుంటాను అనుకుంటూ ఫైలుకోసం వెతుకుతున్నాను. దీని తస్సాదియ్య — ఆ ఫైలు అక్కడే కనిపించింది. పద్మనాభాచార్యులుగారి శకునం అమృతోపమానమైన శకునం అని ధీమాగా తెలుసుకున్నాను. ఇక్కడ చిన్న గమనిక వుంది. ఒంటి బ్రాహ్మడు ఎదురయితే నిక్కచ్చిగా చెరుపే. కాని ఒక్కొక్క ఒంటి బ్రాహ్మడు యీ రూలుని ఎదిరించి పుడతాడు. అప్పుడు శుభశకునం అవుతుంది. ఇదేవాదం యితర శకునాలలోకూడా యిలాగే ఫలిస్తుంది — అని అనుకుంటూండగానే —

ఏడవకయ్యా బాబూ — యిది ఆఫీసు — అరుగో మీ నాన్నగారు అంటూ జవాను జగ్గయ్య మా మూడోవాడు శివకుమార్‌ని — సరాసరి నా సీటు ముందర నిలబెట్టాడు. జగ్గయ్య ఎంత తంటాలుపడినా మావాడు ఏడుపు మానితేగదా. ఏం — నాన్నా — ఏడుస్తూ వచ్చావేం — అన్నాను వాడి కన్నీళ్లు తుడుస్తూ. నన్ను చూసి శివకుమార్ యింకా యేడుపు ఆరంభించాడు. ఎందుకు నాన్నా - అలా ఏడుస్తావ్ అమ్మ కొట్టిందా - ఫరవాలేదులే - వూరుకో. నాన్నవు కదూ — వూరుకో అన్నాను. తల అటూ యిటూ తిప్పి యింకా ఏడుస్తున్నాడు. బాబువి కాదూ - డబ్బివ్వనా? అని జేబులు తడివాను ఎక్కడా నయాపైసాకూడా తగులడలేదు — ఎలా వుంటుంది ఆవేళ 20వ తేదీ అయితే. శివకుమార్, వీడి యిల్లు బంగారం గాను — ముఖారి రాగం బాగా పట్టుతున్నాడు. అది ఆఫీసాయె. పదిమందీ వచ్చే స్థలం. పని చురుకుగా సాగే సమయం. ఆఫీసరు హడావిడిచేసే సమయం. యిలాంటి సమయంలో శివకుమార్ మానకుండా ఏడుస్తున్నాడు. నా ప్రక్కనున్న గుమాస్తా తెచ్చుకున్న టిఫిన్ పొట్లం విప్పి — వాళ్లావిడి వేసిన నేతిగారెలు రెండుతీసి మావాడికిచ్చాడు. నిష్కర్షగా ఆ చిన్న వెధవ ఆ గారెలు రెండూ నిబ్బరంగా తిని మళ్లీ యేడుపు లంకించుకున్నాడు. వూరుకోరా! అంటే వూరుకోడు. ఇలా ఏడవడానికి కారణం ఎనలిటికలుగా యత్నించినా వచ్చినా చెప్పడు. ఓ మహానుభావా! పద్మనాభాచార్యులూ! వచ్చిపడిందయ్యా నీ శకునబలం! అనుకున్నాను. ఇహ వీడు యీగ ఏడుస్తూంటే యెలాగ. వారు వీరూ మూగడం - నాకు చిన్నతనం కావడం. నోరు మూస్తావా మూయవా అని కళ్లెఱ్ఱ చేశాను. మానితేగా, నాకళ్లు చల్లబడ్డాయిగాని చటుక్కున - వాడినోట ఆ ఏడుపుకి ఏమీ అంతులేదు. పాపం తోటిగుమాస్తాలు — పిల్లలున్నవాళ్లు — లేని వాళ్లూ - అదోబాపతు సానుభూతితో కుర్రాడు లెండి అని వాడిని బుజ్జగించడం ఆరంభించి - వూరుకో బాబూ అంటూ వాళ్లు విశ్వప్రయత్నం చేశారు — ఆ ఏడుపు మాన్పించడానికి. ఆ మంకుపట్టు మావాడు వదిలాడా! ఇది పనికాదని మావాడిని దంచితే బాగుంటుందని. ఏ బెత్తమయినా దొరుకుతుందేమోనని వెతుకుతున్నాను. ఎవరా ఏడుపు - ఏమిటీ గలాటా! యిది ఆఫీసా - కాదా! అని అరుచుకుంటూ పెద్ద పెద్ద అంగలు వేస్తూ మా ఆఫీసరు యమధర్మరాజులాగ - గర్జిస్తూ గదిలోకి వచ్చిపడుతున్నాడు. ఏడవకురా బాబూ! అని నోరుమూశాను. నా చెయ్యి అలాగే వుందిగాని ఏడుపుస్థాయి తగ్గలేదు. ఇది కాదు సాధనం అని జేబురుమాలుతీసి వాడి నోటిలో కుక్కుతున్నాను - ఏడుపు తగ్గింది. క్షమించండి - వీడు మా మూడోవాడు. వీడిపేరు శివకుమార్. నా దగ్గర బాగా అలవాటు సార్. ఏ కడుపునొప్పో వచ్చింది. యిలా ఏడుస్తున్నాడు. చిన్నపిల్లలు కదండీ, బాధ చటుక్కున చెప్పలేరు. అని నేను అంటూంటే మా ఆఫీసరు తీవ్రత తగ్గించుకొని, పోనులెండి పసివాడు అంటూ మా శివకుమార్‌ని చూచి - బుగ్గ పట్టుకొని — ఎందుకబ్బాయ్ ఏడుస్తావ్ — అని లబుగా అడిగాడు — కడుపునొప్పా అని ఆయన అంటే ఊహుఁ అని వీడన్నాడు. అన్నింటికీ వట్టి వుహూలే. మరెందుకురా నువ్వేడ్చేది - నిజం చెప్పు నీకు డబ్బిస్తాను అని మా ఆఫీసరు పర్సుతీసి అందు

లోంచి పది నయా పైసల బిళ్ల చూపించుతున్నాడు. దానిమీద దృష్టి లేకుండా మావాడు - మా తాతయ్య చచ్చిపోయాడుట - మా అమ్మా వాళ్లూ ఏడుస్తున్నారు. నాన్నతో చెప్పి రమ్మన్నారు. మా తాతయ్య పప్పులు, మిఠాయి తెచ్చేవాడు — తాతయ్య చచ్చిపోయాడుట అంటూ చెబుతున్నాడు, బిక్క మొహంతో —

అదే - రావుగారూ తాతయ్య చచ్చిపోయాడంటాడే. తాత అంటే ఎవరో అని మా ఆఫీసరు అడిగాడు. నేనేం చెప్పగలను సార్. వీడు యింత ఘాటువార్తని మీ సన్నిధానంలోనే వదిలాడు. కలికాలం కుర్రాళ్లు ఎంత బుర్రగలవాళ్లో చిన్నప్పటినుంచీ - అని నే నన్నాను. తాత అంటే మా నాన్న కావచ్చు. లేదా మా మామగారు కావచ్చు. ఇందులో ఎవరు చచ్చి వుంటారో నేను ఎలాగ వూహించడం. పప్పులు — మిఠాయి - ఇద్దరు తాతలు తెచ్చేవారు. అందుచేత ఏ తాత చచ్చినా యీ కుర్రకుంకకి ఒకసోర్సు పోయినట్లే గదా.

విపత్కాలం నామీద వాలినట్లే గదా. నెలచివర రోజులలో యిలాంటివి సంభవిస్తే ఆ గుమాస్తా గుండె ఎలా కొట్టుకొంటుందో అనుభవించే వాళ్లకిగాని తెలియదు. ఎవరో ఒక తాతట! అది మా నాన్న కాకూడదు వెంకటేశ్వరస్వామీ అని ఏడుకొండలవాడికి దణ్ణం పెట్టుకున్నాను.

రాని ఏడుపు తెచ్చుకొని - కొంచం వుమ్మి కళ్లకు అంటించి భరింపలేని బాధతో బెంగని ఆ ముఖంలో చూపించేసరికి అందరూ నా దగ్గరకు వచ్చారు. ఆ ఆఫీసరు యింక ఫిలాసఫీలోకి దిగారు. ఇంతేనండి — తనువులు అశాశ్వతం, ఇంతకీ పోయినవారెవరని మీరు బాధపడుతూంటా — అని అడిగాడు జాలిగా. బహుశా — మా మామగారే అయివుంటారు. ఇంట్లో మా అత్తగారు వున్నారు. అంతా ఏడుస్తూంటే విధాయకంగా మా మామగారే పోయివుండాలి. మా నాన్న దర్జాగా వున్నాడండీ, నిన్ననే ఆయనరాసిన వుత్తరం అందింది - అని నేను విచారం నిండిన మాటల్ని విడివిడిగా వదిలాను. మామగారు పోతే మాత్రం కష్టంకాదుటండీ — అందులోనూ అత్తగారు యిక్కడే వున్నారంటున్నారే. భార్య మరణ సమయంలో దగ్గఱ లేకపోతే ఆ జీవుడు ఎంత అశాంతిగా తనువు చాలించాడో! అని ఒకరన్నారు. పాపం రావుగారికి అనుకోని ఆపద రివ్వున వచ్చిందే. లేచిన వేళావిశేషం - ఎవరి మొహం చూశారో లేస్తూనే - అని యింకోరన్నారు. ఎవళ్లకి తోచినట్టుగా వాళ్లు ఓదారుస్తున్నారు. బిక్కమొహంతో - బెంగతో నేను అలాగే నిలబడ్డాను.

ఇంకా ఎందుకు అలా బాధపడతారు. కర్తవ్యం ఆలోచించండి. పదిరోజులు శలవుపెట్టండి. అర్జంటు కాగితాలు మీ పక్క గుమాస్తాగారికి అప్పచెప్పండి - అని ఆఫీసరు కొంచం ధైర్యం చెప్పారు. పక్కకి పిలిచి - డబ్బు ఏమయినా కావాలా? అని జాలిగా అడుగుతూ ఎందుకయినా మంచిది యీ యాభై రూపాయలూ దగ్గఱ వుంచుకోమన్నారు. కష్టకాలంలో యిలాగ ఆదరించే వాళ్లుంటే యింకేం కావాలి. కష్టం కష్టంగానే కనిపించదు.

మా ఆఫీసరు చూపిన దయను తలుచుకుంటూ - శివకుమార్‌తో మెల్లిగా యింటికి చేరుకున్నాను. ఏం చెప్పను యింటివరస. మా అత్తగారు హెచ్చుస్థాయిలో ఏడుస్తూంది. ఆవిడకి పక్కపాట పాడుతూంది తక్కువస్థాయిలో మా ఆవిడ. పిల్లలంతా బిక్కమొహాలతో వచ్చీరానట్లుగా ఏడుస్తున్నారు. ఇరుగూపొరుగూ పోగయ్యారు. ఎవరు పోయిందీ తెలియక తికమక పడుతున్నాను. ఏవిటిదంతా? అన్నాను మా ఆవిడతో. ఇంకా ఏవిటిదంతా? అంటున్నారే! అని చప్పట్లు కొడుతూ — గుండె బాదుకుంటూ - నెత్తి పీకుకుంటూ - దేవుడా - దేవుడా - అని గోల పెడుతూంది మా అత్తగారు. మా నాన్నకి నూరేళ్లు అనుకున్నా! మా మామగారైనా అంత చప్పున పోవలసిన మనిషి కాదే. ఇంతలో మా ఆవిడ వచ్చింది. మా నాన్న వెళ్లిపోయాడండీ అని బేరుమంది. కన్నతండ్రి పోతే కాపరానికి వెళ్లిన ఆడబిడ్డలు ఎంత బాధపడతారో అనుకున్నాను. మీ కింతకీ యీ కబురెలా తెలిసింది? అన్నాను మా ఆవిడతో. ఎలా తెలియడం యేవిటి, కుమార్ చెప్పలేదూ అంది డగ్గుత్తికతో. అబ్బే! వాడువచ్చి వత్తి యేడుపు మినహాయిస్తే మాటా — మంతా! ఆఫీసు టుపాకం లేచిపోయేటంత ఏడుపు. ఫలానా వారు పోయారని చెబితేగా — పప్పులు - మిఠాయి తెచ్చే తాతయ్య చచ్చిపోయాడన్నాడు గంటసేపు యేడుపు అయ్యాక. ఆమాట రావడమే అంత యజ్ఞం అయింది. ఇంతకీ యెలా తెలిసింది — అని రెట్టించాను. పోస్టుకార్డు వచ్చిందండీ - యిప్పటిదాకా యిక్కడే వుండాలి - అంటూ వుత్తరంకోసం వెతి

కింది మా శ్రీమతి. ఈ కుర్రకుంకలు వున్నవి వున్న చోట వుంచరుకదా. అన్నీ వీళ్లకే కావాలి. అంతకీ మా ఆవిడ మర్దనం - గుణవర్ధనం అని దంచుతూనే వుంటుంది. కొడితే వీపు అప్పచెప్పుతారే కాని కోణంగితనమూ - కోంటె వేషాలు మాత్రం మానటం లేదు. ఆ విచారంతో అంతకీ వెతికింది. కనిపిస్తేనా ఆ వుత్తరం. కనిపించని వుత్తరంకోసం వాళ్ల అమ్మ అలా కంగారు పడుతూంటే - కుర్రకుంకలు సునిశితంగాచూసి కనిపెట్టారు. ఈ నేరం ఎవళ్లమీద పడుతుందో ఎవళ్లకి చీవాట్లూ - చెప్పుదెబ్బలూ రాశాయో యిప్పుడనుకుంటూ పిల్లిపిల్లలు లాగ మెల్లిగా జారిపోయారు అటూ - యిటూ. అన్నీ చూస్తున్నా, యిలాంటిగి యీ యింట్లో కొత్త కనకనా. సరేలే - ఏం అవస్థ పడతావ్. ఇంతకి జబ్బేం చేసిందో పాపం మావగారికి అన్నాను. మా ఆవిడ బిక్కమొహంతో - అవేమీ లేవు. ఆ వుత్తరంలో మొన్నరాత్రి పోయారని వుంది - అంతే అంది మా ఆవిడ. అంతేలే. మనిషిపోయాక - మరి జబ్బుగొడవలు వర్ణించి లాభం యేమిటి? ఇంతకీ ఎవరు వ్రాశారో ఆ వుత్తరం - అని మళ్లీ ప్రశ్నించాను శ్రీమతిని. ఆవిడ విచారాన్ని గుటకలు వేస్తూ - మీ చాదస్తంకాని ఎవరో ఒకరు గీకి పారేస్తారు ఆ సమయానికి. వాళ్లే రాయాలి - వీళ్లే రాయాలనే నిఘా వుంది కనకనా, వెళ్లిపోయాడు. ఇంత పెందరాళే వెళ్లిపోతాడనుకోలేదు. వచ్చి యిక్కడ రెండు నెలలయినా వుంటానన్నాడు మొన్న మావూరు వెళ్లినప్పుడు. దిక్కుమాలిన చావు, యెంత ముంచేసిందో చూడండి. ఆఖరికి కట్టుకున్న పెళ్లాంకూడా దగ్గర లేకపోయింది కదా - తలుచుకుంటే గుండె తరుక్కుపోతూందండీ. నాన్నా - మమ్మల్నందరినీ వదిలి వెళ్లిపోయావా - అయ్యొయ్యో అంటూ పెద్దపెట్టున ఏడుపు ఆరంభించింది మా ఆవిడ. ఆవిడతోపాటు అత్తగారు. ఇంతమందీ యేడుస్తూవుంటే, మామగారూ! ఎంత మంచివారండీ - అప్పుడే నూరేళ్లూ నిండాయా మీకు అనుకుంటూండగానే నాకూ ఏడుపు వచ్చింది. ఆసెమ్మా - బోసెమ్మా వచ్చారు కదూ. ఏమిటి మీ చాదస్తం - మగవాళ్లు ధైర్యం తెచ్చుకోవాలి - ఆడాళ్లకి ధైర్యం చెప్పాలి. చచ్చినవాళ్లతో సమంగా చావగలమా. ఆయనకేం మగ్గినపండు. చాలా అదృష్టవంతుడు. కొడుకులూ - కోడళ్లూ - అల్లుళ్లూ - కూతుళ్లూ అందరూ హాయిగా వుండగా - చీకూ చింతా లేకుండా వెళ్లిపోయాడు అంటూ వుపన్యాసం యిస్తున్నారు. పరామర్శ మాటలు - కేవలం పడికట్టు రాళ్లు. అవి అందరికీ చేతకావు.

ఇంక యిలావుంటే యెలాగ, ఏం చేయాలో ఆలోచించాలని మా ఆవిడని పిలిచి మళ్లీ అడిగాను. కొంచెం యెక్కువగా వుండగానే ఎక్స్‌ప్రెస్సు టెలిగ్రాం యివ్వకూడదా చెప్పు, చూపులేనా దక్కేవి. పోయాక - యీ వుత్తరం వ్రాశారు. ఎంత తెలివిగలవాళ్లు. ఈపాటికి అప్పుడే దహన సంస్కారాలుకూడా అయే వుంటాయి. పాపం - అత్తగారికి ఏమి చెప్పాలనుకుంటూ పోయారో! అని అంటూ మా ఆవిడకి కొంచం ధైర్యంచెప్పి - అత్తగారిని ఓదార్చి - ఇంక మూడున్నర గంటల బండికి పోవాలి - అన్నీ సిద్ధం చెయ్యండి - నేను వెళ్లి రెండు జట్కాలు తెస్తాను స్టేషనుకి - అన్నాను. మా ఆవిడ ప్రక్కకు పిలిచి డబ్బు యెక్కడైనా చూశారా - అందరం కదిలి వెళ్లడం మాటలా! అంది. మా ఆఫీసరుగారు - ఎంతో జాలిచూపిస్తూ పదిరోజులు క్యాజువల్ లీవుతోసహా వడ్డీలేని చేబదులుగా యిచ్చిన యాభై రూపాయల మాటూ చెప్పేసరికి - చూశారా - యిదంతా మా నాన్న మహిమ కాదంటారా? అంది. ఎలాగనుకొన్నా మంచిదేలే అనిచెప్పి నేను చరచరా జట్కాలకోసం బయలుదేరాను. అప్పుడే అప్పటికి చూస్తుండగా రెండు దాటింది. అర్జంటుగా జట్కాలు తెచ్చి యింటిముందు వుంచాను. మా ప్రక్కవాటాలో వున్నవారూ లేరు. వాళ్ల ఆవిడ పుట్టింటికి పురిటికి పోయింది. ఆయన హైస్కూలు మేష్టరు. ఇంట్లో ఆడాళ్లుంటే మధ్యాహ్నం కాఫీకి వచ్చేవాడు. సత్రం భోజనం మఠం నిద్రలాగ - హోటలు భోజనం - ఒంటరి మకాంలాగ వుంది ఆయన పని. కాని చాలా వుత్తముడు. ఆయన లేనందుకు చాలా విచారించి దాసీదానితో చెప్పమన్నాను - ఆయనకీ సమాచారమంతా. అన్నీ సర్దుకొని తాళాలు బిగించి - ముఖారి రాగాలు నిండిన ముఖాలతో అందరం జట్కాలు యెక్కాం. జట్కాలు చకచకా పోతున్నాయి. నాకుమాత్రం బావమరది మీద మహాచెడ్డకోపం వచ్చింది. మనిషిని చూసుకోలేని పరిస్థితిలో పెట్టేడే - అని. ఏం చేస్తాం! అనుకున్నాం. అసలే తండ్రి పోయిన కష్టం గదా! అందులోనూ మనం యీ దులిపి పారేయడం ఏం నీతి! అనుకున్నాను. ఇంతలోనే రైలుస్టేషను వచ్చింది. దిగాం. పోయి టిక్కెట్టుకొని - సామానుతో - పిల్లలతో - జల్ల

ప్లాటుఫారం మీదకు వచ్చాం. జనంతో కిటకిటలాడుతున్నారు. పాపం - మా అత్తగారికి ఆ స్టేషను చూచేసరికి మా మావగారు జ్ఞాపకానికి వచ్చారు. మొన్ననే కదూ ఆయనే స్వయంగా వచ్చి మా అత్తగారిని యిక్కడ దిగబెట్టి వెడతా. ఇంతలోనే ఎంత లోపం ఎదురయిందిరా దేవుడా — ఎలాగ యీ బెంగని దిగమ్రింగడం అని ఆవిడ చాలా విచారించడం - తల్లిని పట్టుకొని బిక్కమొహంతో మా ఆవిడ యింకా కుంగిపోవడం - వీళ్ళిద్దరినీ చూసి నేను నిలువునా నీరయిపోవడం — ఇదంతా పద్మనాభాచార్యులు శకునమహిమ కాకపోతే మరేమిటి అనుకున్నాను. ఇతర ప్రయాణీకులు మమ్మల్ని చూసి చిన్న చిన్న పొడిప్రశ్నలు వాళ్ళే వేసుకొని వాళ్ళ ప్రశ్నలకి వాళ్ళే సమాధానం చెప్పుకుంటున్నారు. రైలు గంట లేటు అన్నారు. చూశారా! ఒక అపశకునం తన్ను చూసుకొని మానవుడిమీద వాలిందంటే — యిక లెక్కలేనన్ని అపశకునాలు. ఈ రైలు యివాళే లేటు కావాలా. ఇది యీ రాజమండ్రీలోనే గంటలేటుగా వస్తే - ఆ నిడదవోలు బండి యింకేం వుంటుంది. అది ముందే వుడాయిస్తుంది. హరహరా అంటూ ఆ నిడదవోలులో జాగరణ చేయాలేమో - పోనీ యింటికి పోదామా అంటే తీరా టిక్కట్లు కొన్నాను. కొన్నటిక్కట్లు స్టేషనులో యిచ్చి — ఏ అణాయో టిక్కట్టుకు తీసుకొని మళ్లీ మనడబ్బు మనకిస్తారు. ఈమాట మా ఆవిడ చెవిలో పడేసేసరికి — భగ్గున మండిపోయింది. ప్రాణాలే పోయాయి. వెధవడబ్బు మనల్ని రక్షిస్తుందా - ఎప్పుడూ యిలా అవస్థ పడతామా — ఆ జీవికోసం కొంచం ఓపికపట్టలేరూ - ఏమిటండీ! మీరూ మీ కంగారూ అని ఆవిడ విసిరి పారేసింది చిటపటల్లాంటి సిసింద్రీలని. ఆ ధాటీకి ఆగలేక ఎంత లేటయినా యీ ప్రయాణం నిబద్ధి అని తీర్మానించుకొని మళ్లీ వాకబుచేశాను గంటదాటిన పిదప - బండి వస్తుందా అని. అయ్యో సారీ-సార్- యీ టేక్అప్ — యిన్‌డెఫినెట్లీ లేటు అన్నాడా స్టేషను మేస్టరు. ఆ మాటల్ని విని అలా కూలిపోయాను. ఇలా నిరుత్సాహంగా నేనుంటే అక్కడే వున్న కొంతమంది స్నేహితులు యీ విషయం తెలియక - నా దగ్గఱకు రావడం ఏదో కులాసాకబుర్లు చెప్పడం. నా ముఖకళ వట్టిబెంగతో వుండడం వాళ్లు గ్రహించడం - అలా వున్నారేం అని వాళ్లు అడగడం - మా మావగారు పోయారండీ - సకుటుంబంగా పోతున్నాను అని చెప్పడం జరిగింది. పదేళ్ళగా రాజమండ్రీలో పాతుకొని వున్నానేమో. వుద్యోగరీత్యా స్నేహితులు కొందరు, అసలు మన విద్యార్థి దశ వీరేశలింగం హైస్కూలు — ఆర్ట్సు కాలేజీలోనే గదా సాగింది. అరీత్యా కొందరు, చుట్టాలు కొందరు, చుట్టాల చుట్టాలు కొందరు, దూరపు చుట్టాలు కొందరు—ఇలాగ పరిచయం చాలా బాగా పాకింది. ఆ పరిచయస్థులు చాలామంది నాకు వచ్చిన యీ కష్టాన్ని ఆనోటా యీనోటా వినడం - బండి బ్రహ్మాండంగా లేటుకావడం — నన్ను క్యూ సిస్టములో పరామర్శించడం. కష్టం ఒంటరిగా బాధించదుకాని - కష్టాన్ని ఒకళ్లు అరటిపండు వొలిచినట్లు విడదీసి విమర్శించి పరామర్శిస్తూంటే - అది భరింపలేని బాధగా వుంటుంది. ఆ స్టేషను ప్లేటుఫారంమీద యిలాంటి అవస్థలో పడివున్నాం. రైలు జాడలేదు. జనం నిరుత్సాహంగా జారుతున్నారు. కాఫీలకని కొందరు, కాలక్షేపానికని కొందరు. నాకుమాత్రం కదలాలనే లేదు. కాఫీమాట తలపెడితే మా ఆవిడ ఏం కంగుతుంటుందోనని ఆ మాటనే ఎత్తక రైలు ఛప్పునవస్తే బాగుండునని రైలు తపస్సు చేస్తున్నాను.

పాపం - మా ప్రక్కవాటా మేష్టారు దాసీదాని మూలంగా యీ మాట విన్నాడుకాంసు. చాలా వుత్తముడు. అలాంటివాడు నా ప్రక్కవాటాలో వున్నందుకు నేను ఎంతో సంబరపడతాను. ఉంటారు - మరికొంతమంది పెటేపకాయి పొరుగువాళ్లు - అస్తమానం గొడవ. అన్నింటికీ రభస. మంచీ లేదు మర్యాదలేదు. వచ్చి - జేబులోంచి తీస్తున్నాడు యేదో. మళ్లీ మానేశాడు. రావుగారూ — చాలా కష్టం వచ్చిందండీ - యిప్పుడే మన అప్పలమ్మ చెబితే విన్నాను. అయ్యో! అని విచారాన్ని ప్రకటించాడు. మా వాళ్లని - అత్తగారిని సమీపించి వాళ్లనికూడా ఓదార్చాడు. దిక్కుమాలిన రైలు యివాళే యింత లేటు కావాలా చెప్పండి అన్నాడు. మళ్లీ చేతిని జేబులోకి పోనిచ్చి - అయిదు పదిరూపాయల నోట్లు తెచ్చి నాకిచ్చాడు. అబ్బే — వద్దండీ - వుంది నా దగ్గిర అన్నాను. నామాట వినండి — కష్టకాలం ఏదయినా అవసరం వుంటుంది. మీకు తెలియదు తీరికగా మనం మనం చూసుకుందాం అంటూ — ఎంత ఆదరణ! ఎంత లాలన!

కాస్సేపు యిద్దరం రైళ్లు లేటుగా రావడం గురించీ - తర్వాత యాక్సిడెంట్లని గురించీ - ప్రయాణీకుల రద్దీనిగురించి - రైళ్లల్లో దొంగతనాలని గురించి

ముఖ్యంగా మా ప్రయాణంపడే యిబ్బందిని గురించీ మాట్లాడుకున్నాం. ఇల్లు భద్రంగా చూడండి అని నేను చెప్పాను. సరేలెండి ఆయన అంటూ వదలలేక వదలలేక ఆయన వెళ్ళిపోయాడు.

వెళ్ళినవాడు మళ్ళీ గుండెలు గోక్కుంటూ వచ్చాడు. చూశారా - నా మందమతితనం - మీకు వచ్చిన వుత్తరం పోస్టుజవాను మా యింట్లో పడేశాడండీ అంటూ ఒక కవరు వుత్తరం నా చేతిలో పెట్టాడు. ఆ వుత్తరం చేతిలో పెడుతూ - ముందే యీ వుత్తరం యివ్వాల్సింది - యీ తొందరలో తోచలేదు రావుగారూ అని మాట్లాడుతున్నాడీయన. ఫరవాలేదులెండి అని నేను అంటూంటే మా శ్రీమతి వచ్చింది _ రైలు యింకా రాదా అంటూ. ఏమో! అంటూ కవరు చింపుతున్నాను నేను. సమయానికి కనిపించదు. మీరందాకా అంతగా అడిగారా _ ఆ కార్డు ఏది - ఏది అని. నా మందమతితనం మండిపోనూ _ ఇదిగో నా కొంగుని ముడేసివుంచా అని చెప్తూ ఆ కార్డు యిచ్చింది ఆవిడ.

ఆ కవరు చింపి ఆ ఉత్తరం చూశాను. ఆవిడ యిచ్చిన ఆ కార్డు చూశాను. ఇప్పటివరకూ ఆ కార్డు చూపించనందుకు మా ఆవిడమీద ఎంతయినా కోపం వచ్చింది.

ఈ కార్డేనా నువ్వు చదివింది అన్నాను. ఔనంది - ఆవిడ. మీ నాన్నకి నూరేళ్లు - అని నేనంటూంటే _ మేష్టారు ఆ కార్డువైపు చూస్తున్నాడు. స్పష్టంగా ఆయన యడ్రస్సుంది ఆ కార్డుమీద. ఏమిటి రావుగారూ _ ఆ కార్డుమీద నా యడ్రస్సు వుందంటూరా? అన్నాడాయన.

మా ఆవిడ ముఖం వెలవెలపోతూంది.

ఆ కార్డును మేష్టారికిచ్చాను. కవరు మా ఆవిడ చేతిలో పెట్టాను. నాలిక కరుచుకొని నవ్వుకుంది. చరచరా వాళ్ళ అమ్మ దగ్గరకు పోయింది. కవరు వుత్తరం సారాంశాన్ని చెప్పింది. ఎక్కడలేని ఆనందం ఆ ముత్తైదువ ముఖంలో తాండవించింది.

కార్డును చదువుకున్న మేష్టారు - నిలువునా! కూలిపోయాడు. దిగాలుపడుతున్న ఆయనకు ధైర్యం చెప్పాను. రావుగారూ - పోయింది మీ మామగారు కాదండీ _ మా మామగారు. ఈ వుత్తరం మా బావ వ్రాశాడు. మీకెలా వచ్చిందో యిది అనుకుంటున్నాడాయన.

ఎలారావడం యేమిటిలెండి! మన బీటుకివచ్చిన పోస్టుమేను పాతకొత్తవాడు. ఒకరికిచ్చే వుత్తరం యింకొకరికిచ్చాడు. ఇంతకీ యడ్రసు చూసుకోకుండా యింటర్మీడియటు పాసయిన మా యిల్లాలు యింతగా పెద్దమనుష్యుల్ని ఏడిపించింది - ఏమనాలి చెప్పండి.

ఎందుకయినా మంచిది - నా మాట వినండి _ యీ యాభై రూపాయలు మీ దగ్గర వుంచండి అని మేష్టారి చేతిలో యాభై రూపాయలూ వుంచాను. ఇదే రైలుకి నేనూ వస్తాను. యింకా లేటుట. యింటికిపోయి వస్తానని విచారంగా వెళ్ళిపోయారు. పోతూపోతూ _ కనిపించిన వాళ్ళందరికీ రావుగారి మావగారు పోలేదు _ పోయింది మా మావగారే అంటూ తన కష్టాన్ని చెప్పుకుంటున్నాడు.

ఇహ మా అత్తగారు - మా మావగారు వ్రాసిన ఆ వుత్తరాన్ని వందసార్లు చదువుకుంది. ఇదంతా కలగా వుంది నాయనా అంది. మీ అమ్మాయి తెలివి యిలా తెల్లారిందన్నాను. పోస్టువాళ్లు యింతమోసం చేస్తారని ఎవరు కలగన్నారు అని మా ఆవిడ యీ తప్పుని ఆ పోస్టుమేనుమీద వేసింది.

పిడుగులాగ మా ఆఫీసరు _ హెడ్డుగుమాస్తా షికారుగా స్టేషనుకు వచ్చారు. ఏమయ్యా రావూ! క్యాజువల్ లీవుకి బలే స్టంటుకొట్టావే. ఇంతకీ మీ వాళ్ళెవరూ పోలేదట, పైగా మీ బావమరిది కొడుక్కి బారసాలట. బారసాలకోసం _ శలవూ; డబ్బూ సంపాయించావే _ అని ఫిరాయింపు విచారం విని ఫక్కున నవ్వుతూ _ ఈ బారసాలకి నువ్వుపోయి యేంచేస్తావ్ - శలవు కేన్సిలు చేసుకుని ఆఫీసుకురా! అన్నాడు. ఇంతలో రైలు కూతకూస్తూ ఎదురుగా వచ్చి ఆగింది. మా ఆవిడ చొరవగా పిల్లలతో - సామానుతో - ఆనందంగావున్న అత్తగారితో రైలెక్కింది. మీరూ రండి - యింకా అలా నుంచుంటారే? అంది - ఆవిడకేం తెలుసు ఆఫీసర్ల ఆగ్రహానుగ్రహాల ఫలాలు. సరేలే _ వెళ్లిరా - చప్పున - శలవు పొడిగించక అని వీపుమీద తరచి వీడ్కోలిచ్చారు మా ఆఫీసరుగారు.

అష్టకష్టాలూ పడి ఆ మర్నాడు వూరు చేరుకున్నాం. తోరణాలు కట్టారు. సన్నాయి సాగుతూంది. మంత్రాలు చదువుతున్నారు. బారసాల పీటలమీద కొడుకూ _ కోడలు కూర్చుంటే మా

మావగారు ఆనందిస్తున్నారు. నీ పేరే పెడుతున్నాను నాన్నా అని కొడుకు చెబుతున్నాడు — శుభం అని మా మావగారు వీధివైపు చూస్తున్నారు - మేమింకా రాలేదేం! అని. జట్కాలోంచి మేం దిగగానే — మా మరదలు గంతులేస్తూ — అదిగో అక్క! అదుగో బావ! యిదుగో అక్కయ్యగారి పిల్లలు అంటుంది.

అహా! వచ్చారా! అని మా మావగారు ముసి ముసి నవ్వులతో మురిసిపోయారు. అంతట్లోనే మా అత్తగారు - మావగారి కాళ్లకి కన్నీళ్లతో కడిగి దణ్ణం పెట్టారు. ఇదేవిటే యిలా యిడవుతావు అంటూ మావగారు తెల్లబోయారు.

అంతా శుభాంతం కాగా — భోజనాలయాయి. తాంబూలాలు సేవిస్తూ - ఉత్తరాలతర్జ - విచారం ఫిరాయింపు ఎంతలో ఎంత జరిగిందో వినండి అంటూ జరిగినదంతా మావగారికి మనవిచేశాను. కడుపు చెక్కలయ్యేటట్టు నవ్వుతున్నారందరూ. ఎందుకో మరి! మా శ్రీమతి ముఖం చిన్నబోయింది.

స్వీకారము

గీతాధ్యానము ; శ్రీ స్వామి చిన్మయానంద, అనువాదం - శ్రీ ఉ. రాధా కృష్ణమ్య. ప్రచురణకర్తలు - చిన్మయామిషన్, పాకాల, చిత్తూరు జిల్లా.

పూజ్యపాద శ్రీ చిన్మయానంద స్వాములవారి ఉపన్యాసములకనువాదము. ఉపనిషదులులాంటి గ్రంథములకు శ్రీ స్వాములవారి వ్యాఖ్యానము కడుసులభమై సామాన్యప్రజలు సయితము గ్రహించుటకనువైనదిగానుండును. కాబట్టియే వారి ఉపన్యాసములు వేలకొలది ప్రజలను ఆకర్షించుచుండును. ఇట్టిదే యీ చిన్న పుస్తకము సయితము. ఇందులో భగవద్గీత ప్రాశస్త్యమును వివరించుటతోబాటు దానినిపఠించి, అనుష్ఠానమునందుంచుకొను మార్గములు వివరించబడినవి. ప్రతిహిందువునకు భగవద్గీత పవిత్రగ్రంథమై తన్ను తాను తీర్చిదిద్దుకొనుట కుపయోగపడునదగుటచే యీ చిన్న పుస్తకము గీతాపారాయణ, అనుష్ఠానములపట్ల ఆసక్తిని పెంపుచేయును.

కవిత్రయ కవితారీతులు - తరువాతి కవులపై వారి ప్రభావము : శ్రీమతి దేశిరాజు భారతీదేవి, బాపట్ల. వెల రు 2-50.

ఇది తెలుగు భాషాసమితివారి రు. 500/-లు బహుమతి బడసినగ్రంథము. ఈ గ్రంథరచనా సందర్భమున రచయిత్రి అమూల్యమైన పరిశోధనా పూర్వకమైన కృషిచేసియున్నారు.

కవిత్రయమువారైన నన్నయ, తిక్కన, ఎఱ్ఱనల కవితారీతులను ఉదాహరణలతో వివరించుచు దరిమిలాకవులపై వారి ప్రభావముండినది నిరూపించుట సామాన్యమైనపని కాకపోయినా రచయిత్రి సాహసించి చేసినకృషి అభినందించతగినది.

భారత కవితాపరిశోధనము, ఆకవి తాపత్రభావము దరిమిలా కవులపై, వారి రచనలపై నెట్లు ప్రతిఫలించినది నిరూపించ ప్రయత్నించిన నీగ్రంథము తెలుగు సారస్వత సంపదకు అమూల్యపుష్పము.

ఆంధ్ర మహావిష్ణువు: శ్రీ వజ్ఝల కాళిదాసు, ప్రవాసి ప్రచురణలు - ఆంధ్ర విజ్ఞాన సమితి, విర్డినివాస్'ఎమ్' రోడ్డు, బిష్టుపూర్, జంషెడ్‌పూర్. వెల75 న. పై.

ఆంధ్రజాతి మూలపురుషుని గాథ. ఇంతకేముందు యిది ఆంధ్రపత్రిక స్వర్ణోత్సవ సంచికలో ప్రచురించబడినదైనా మృదుమధురమైన సరళిలో రసవంతంగా నడచిన కావ్యమిది. ఆంధ్ర మూలపురుషుని గురించి, ఆయన వీరోచితంగా సాధించిన విజయాలను గురించి వివరించిన యీ కావ్యము ప్రతియొక్క ఆంధ్రుడు చదువవలసినది.